ప్రజాశక్తి

శనివారం 4 మే 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పింఛన్ పాట్లు



ఆనందపురం మండలం వెల్లంకిలోని ఎస్‌బిఐ బ్రాంచి వద్ద వేచి ఉన్న పింఛనుదారులు

- మూడో రోజూ పడిగాపులే
- లబ్ధిదారులతో కిక్కిరిసిన బ్యాంకులు
- వృద్ధుల అవస్థలు వర్ణనాతీతం

సామాజిక భద్రత పింఛను లబ్ధిదారులకు శుక్రవారమూ అవస్థలు తప్పలేదు. నిర్దేశిత లబ్ధిదారుల ఖాతాలోకి పింఛన్ సొమ్మును ప్రభుత్వం జమ చేయగా ఆ మొత్తాన్ని తీసుకునేందుకు వృద్ధులు, పలు రకాల పింఛనుదారులు పడిగాపులు కాసారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఏ బ్యాంకు వద్ద చూసినా పింఛనుదారులే కనిపించారు. 30 - 40 కిలోమీటర్ల దూరం నుంచి మండుటెండలో మండల కేంద్రానికి వచ్చి, క్యూలైన్లలో గంటలకొద్దీ నిల్చొని పింఛన్ తీసుకోవడం కష్టతరంగా మారింది.

ప్రజాశక్తి - **బుచ్చయ్యపేట :** మండలంలోగల బుచ్చయ్యపేట, రాజాం, సీతయ్యపేట, వడ్డాది ప్రాంతాల్లోని బ్యాంకుల వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. ఉక్కబోతతో పలువురు ఇబ్బందిపడ్డారు. గ్రామాల్లోగల మినీ ఎటిఎంల వద్దా పింఛనుదారులు బారులుతీరే కనిపించారు.

ఆనందపురం : మండలంలో 6818 మంది లబ్ధిదారుండగా 4651 మందికి బ్యాంకు ఖాతాల్లో పింఛన్ సొమ్ము జమ చేశారు. 2167 మందికి మిగతా 2లో..



చోడవరంలో పడిగాపులు కాస్తున్న పింఛనుదారులు



సదస్సులో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, చిత్రంలో విజయరావు తదితరులు

బిజెపితో పొత్తు నయవంచనే

- అభివృద్ధి కోసమంటూ ప్రజల చెవుల్లో పువ్వులు
- మోడీని గద్దె దించకపోతే దేశానికే ముప్పు
- రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

బిజెపితో తాము పొత్తు పెట్టుకున్నది రాష్ట్రాభివృద్ధి కోసమే అంటూ టిడిపి, జనసేన నయవంచనకు పాల్పడుతున్నాయని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. అనకాపల్లిలోని రోటరీ క్లబ్‌లో శుక్రవారం ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పాలక పార్టీల మోసాలను ఎండగండుతూ రూపొందించిన 'నయవంచన' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేదిక కో కన్వీనర్ విజయరావు, కాంగ్రెస్ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ, సిపిఎం అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కన్వీనర్ అజయ్ కుమార్, ఆమ్ ఆద్మీ రాష్ట్ర నాయకులు రమేష్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు గంగాధర్, శీనివాసరావు, రుత్తల శ్రీరామమూర్తి, బోని తాతారావు, జె.శ్రీనివాస్, తనకాల అనంతరావు, పిరిడి భగత్ పాల్గొన్నారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)

కోరాపుట్-జగ్దల్‌పూర్ సెక్షన్‌లో తనిఖీలు

వార్త 2లో..

ఎంవివి కార్యాలయంలో సోదాలు

వార్త 2లో..

వార్డుల్లో సిపిఎం, కాంగ్రెస్ ప్రచారం

వార్త 8లో..



స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నినదిస్తున్న విమలక్క, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

విశాఖ ఉక్కు జోలికొస్తే ఊరుకోం

అరుణోదయ విమలక్క

వార్త మెయిన్‌లో..

సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సికింద్రాబాద్ - బ్రహ్మపూర్‌ల మధ్య ప్రత్యేక వేసవి రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ మేరకు 07027 సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మే 10 శుక్రవారం రాత్రి 20.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.33 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 09.38 గంటలకు బయలుదేరి 14.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. 07028 బ్రహ్మపూర్ - సికింద్రాబాద్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మే 11 సాయంత్రం 16.45 గంటలకు బ్రహ్మపూర్ నుంచి బయలుదేరి, అదేరోజు రాత్రి దువ్వాడకు 21.55 గంటలకు చేరుకుని మరలా 22.00 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

07035 సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ మే 11, 14 తేదీలలో రాత్రి 20.45 గంటలకు సికింద్రాబాద్ నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.33 గంటలకు మిగతా 2లో..



ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న బాలకృష్ణ

వైసిపి పాలనంతా అవినీతిమయం

- సినీ నటుడు బాలకృష్ణ

ప్రజాశక్తి - మాధవధార, ఆరిలోవ

రాష్ట్రంలో వైసిపి ఐదేళ్ల పాలనంతా అవినీతిమయంగా మారిందని సినీ నటుడు, టిడిపి హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. స్వర్ణాంధ్ర సాకర యాత్ర - బాలయ్య అన్‌స్టాపబుల్ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా ఆయన తలపెట్టిన యాత్ర శుక్రవారం విశాఖ జిల్లాలో కొనసాగింది. పార్క్ హోటల్ నుంచి బాలకృష్ణ రోడ్ షో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



నక్కపల్లిలోని ఐఒబి బ్రాంచి వద్ద నిరీక్షిస్తున్న పింఛనుదారులు

పింఛన్ పాట్లు

ఇంటికెళ్లి పింఛన్లు ఇచ్చారు. అంత వరకూ బాగానే ఉన్నా బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు తీసుకునేందుకు వచ్చిన వారికి మండలంలో అవస్థలు తప్పలేదు. వెల్లంకి ఎస్‌బిఐ శాఖ వద్ద ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ పెద్ద సంఖ్యలో పింఛన్‌దారులు కనిపించారు. పేకారు గ్రామం నుంచి పది మంది ఆటో కట్టించుకుని వెల్లంకి బ్యాంకుకు వచ్చారు. రెండు గంటలపాటు నిరీక్షిస్తే చేతికి సొమ్ము అందినట్టు చిమ్మటి పైడమ్మ, గొట్టిపల్లి గ్రామానికి చెందిన బుత్తల రాము, వెల్లంకికి చెందిన దుక్క రాము తదితరులు వాపోయారు. సిర్లపాలెం గ్రామానికి చెందిన కోరాడ అప్పలనారాయణమ్మ వేములవలస స్టేట్ బ్యాంక్‌కురాగా సొమ్ము జమ కాలేదని చెప్పడంతో ఆమె ఉసూరుమంటూ వెనుదిరిగింది.

నక్కపల్లి : మండలంలోని ఐఒబి శాఖ నుంచి పింఛన్ డబ్బులు తీసుకునేందుకు 41 డిగ్రీల ఉష్ణోగ్రతలను తట్టుకుని మరీ పింఛనుదారులు వచ్చారు. బ్యాంకు వద్ద అధికారులు టెంట్ వేసి సౌకర్యాలు కల్పించారు. వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎంపిడిఒ శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, ఎఒ సీతారామరాజు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ బ్యాంకు వద్దే ఉండి ఏర్పాట్లును పర్యవేక్షించారు.

చోడవరం : మండలంలోని ఈ సేవ, వినియోగదారుల బ్యాంకు సేవా కేంద్రాల వద్ద పింఛనుదారులు పడిగాపులు కాస్తూ కనిపించారు.



రోడ్‌షోలో అభివాదం చేసుకుంటూ ముందుకు సాగుతున్న బాలకృష్ణ

వైసిపి పాలనంతా అవినీతిమయం

నిర్వహించారు. అప్పుఘర్, జోడుగుళ్లపాలెం, పోలీస్ క్వార్టర్స్ మీదుగా విశాలాక్షినగర్, హనుమంతువాక, పాత డెయిరీఫారం, ఆదర్శనగర్, తోటగరువు, బాలాజీనగర్, అంబేద్కర్ కూడలి, ఆరిలోవ టిఐసి పాయింట్, ఆరిలోవ కాలనీ తదితర చోట్ల ఆయన యాత్ర సాగింది. కంచరపాలెం మెట్టు వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని జగన్ మోసం చేశారన్నారు. జాబ్ క్యాలెండర్‌ను విస్మరించారని విమర్శించారు. ఆయన తీరుతో ఎపికి రావాల్సిన పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. ప్రశాంతమైన విశాఖ నగరాన్ని భూకబ్జాల నగరంగా మార్చారని, ప్రకృతిని ధ్వంసం చేశారని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు రప్పించుకోలేకపోయిన అసమర్ధ ప్రభుత్వమని విమర్శించారు. ఎపిలో టిడిపి, జనసేన, బిజెపి కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి శ్రీ భరత్, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు, బిజెపి ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు. బాలకృష్ణ రోడ్‌షోకు ఆదరణ లభించింది. కూటమి కార్యకర్తలే కాకుండా బాలయ్య అభిమానులూ బైకులు, ఆటోలపై పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బాలకృష్ణ సినిమా డైలాగులతో, హావభావాలతో ఆకట్టుకున్నారు.

సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

దువ్వాడ చేరుకుంటుంది. మరలా 09.38 గంటలకు బయలుదేరి అదేరోజు 14.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. 07036 బ్రహ్మపూర్ - సికింద్రాబాద్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మే 12, 15 తేదీలలో సాయంత్రం 16.45 గంటలకు బ్రహ్మపూర్ నుండి బయలుదేరి అదేరోజు రాత్రి దువ్వాడకు 21.55 గంటలకు చేరుకుని, మరలా 22.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.05 గంటలకు సికింద్రాబాద్ వెళ్తుంది.

ఈ రైళ్లు పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, నౌపడ, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం మీదుగా ప్రయాణిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

ఎంవివి కార్యాలయంలో సోదాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం లాసన్స్ బే కాలనీలోని తూర్పు నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ నివాసం, కార్యాలయాల్లో ఎలక్షన్ కమిషన్‌కు చెందిన మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు శుక్రవారం సాయంత్రం. 8 గంటల నుండి సోదాలు చేపట్టాయి. ఒక బృందం ఆయన నివాసంలో సోదాలు చేపట్టగా, మరో రెండు బృందాలు ఆయన కార్యాలయంలో సోదాలు చేపట్టాయి. ఈ సోదాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఎస్‌టి టీం - 4, ఈస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం - 1తో పాటు మరో బృందానికి చెందిన సుమారు 25 మంది అధికారులు పాల్గొన్నారు. సోదాల విషయం తెలుసుకున్న ఎంవివి.సత్యనారాయణ 9:30 గంటలకు తన కార్యాలయానికి వచ్చారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి.



ఎంవివి కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కోరాపుట్-జగ్దల్‌పూర్ సెక్షన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శుక్రవారం జగ్దల్‌పూర్ - కోరాపుట్ సెక్షన్‌లో సమగ్ర తనిఖీలు నిర్వహించారు. వీటిలో భాగంగా సెక్షన్‌లోని ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచడం, కొనసాగుతున్న అభివృద్ధి కార్యకలాపాలు, డబుల్ లైన్ పనులు, భద్రతా చర్యలను సమీక్షించడంపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్‌లలో వెయిటింగ్ హాల్స్, సీటింగ్ ఏర్పాట్లు, తాగునీరు లభ్యతను పరిశీలించారు.



అధికారులతో సమీక్షిస్తున్న రైల్వే డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

అనంతరం జగదల్పూర్ వద్ద ఎన్ఎండిసి స్టీల్ ప్లాంట్ అధికారులు, సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉక్కు రేకుల సరఫరా కార్యకలాపాలను మెరుగుపరచడం, రేక్‌లను లోడ్ చేయడానికి పాయింట్లను ఏర్పాటు చేయడం, ఉక్కు కర్మాగారం పూర్తి సామర్థ్యానికి చేరుకున్నప్పుడు, డిమాండ్‌లను తీర్చడానికి లాజిస్టిక్‌లను ఆప్టిమైజ్ చేయడం, భవిష్యత్తు ప్రణాళిక అంశాలపై చర్చలు నిర్వహించారు. ఈ తనిఖీలు కోరాపుట్, ఖడపా, చరముల కుసుమి, కోట్‌పర్ రోడ్, అమగురా, జగదల్‌పూర్‌తో సహా కీలక స్టేషన్‌లలో నిర్వహించారు. మనోజ్ కుమార్ సాహూ పాల్గొన్నారు.

దక్షిణంలో ఝాన్సీ, వాసుపల్లి ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వైసిపి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. వారికి మద్దతుగా సినీ నటుడు కృష్ణ, మహేష్ ఫ్యాన్స్ భారీ ర్యాలీ చేపట్టారు. జగదాంబ జంక్షన్‌లోని వైఎస్ఆర్ విగ్రహం నుంచి పాతపోస్టాఫీస్ వరకు జరిగిన ఈ ర్యాలీలో ఝాన్సీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అంటే మహానటుడు కృష్ణనే గుర్తుకొస్తారన్నారు. ఈ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం ఛైర్మన్ జాన్ వెస్లీ, రెల్లి కార్పొరేషన్ ఛైర్మన్ వడ్డాది మధుసూదనరావు, విశాఖ సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు గాజుల వెంకట్రావు, డొప్ప రమణ, వాసర్ల సుబ్రహ్మణ్యం (బుజ్జి), బిసి హెచ్.అప్పారావు, వైసిపి నాయకులు దశమంతల మాణిక్యాలరావు, షరీఫ్ పాల్గొన్నారు.

మత్స్యకార అభ్యర్థులను గెలిపించుకుంటాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో మత్స్యకార సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులను గెలిపించడమే తమ ధ్యేయమని ఆంధ్ర మత్స్యకార సంఘాల సమన్వయ సమితి చైర్మన్ శైకం రాజశేఖర్, నాయకులు పరిమళ్ల వాసు, పులి రాజు, డాక్టర్ మూగి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తమ సామాజిక తరగతికి జగన్మోహన్ రెడ్డి ఐదు అసెంబ్లీ సీట్లు ఇచ్చారని, వారిని గెలిపించుకునేందుకు ప్రయత్నిస్తామన్నారు. దక్షిణ నియోజకవర్గ సభలో పవన్ కల్యాణ్ మత్స్యకారులపై ప్రేమ ఒలకబోస్తూ ఊకదంపుడు ప్రసంగం చేశారని, నిజంగా ప్రేమ ఉంటే తమ కమ్యూనిటీకి ఎందుకు ఈ నియోజకవర్గంలో టిక్కెట్ ఇవ్వలేదని ప్రశ్నించారు. అగ్ని ప్రమాదంలో లక్షల విలువ చేసిన బోట్లు దగ్ధం కాగా రెండు రోజుల్లోనే బోట్లుకు జరిగిన నష్టానికిగాను 80 శాతం మేర నష్టపరిహారం సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అందజేసిందని తెలిపారు. మాజీ కార్పొరేటర్, మహిళా నాయకురాలు గరికిన గౌరి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలలో పవన్ కల్యాణ్‌గానీ, చంద్రబాబుగానీ గొప్ప మాటలు మాట్లాడారని, అయితే ఒక్క మత్స్యకారునికి కూడా సీట్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

అభివృద్ధిని చూసి ఓటేయాలి : కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అన్నారు. జివిఎంసి 53వ వార్డులో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సుమారు రూ.430 కోట్లతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గంగా నిలబెట్టేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు చౌక్కాకుల వెంకటరావు, దానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ బర్కత్ ఆలి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జివిఎంసి 14వ వార్డు పరిధి నరసింహనగర్ ప్రాంతంలో వార్డు కార్పొరేటర్ కటారి అనీల్‌కుమార్ రాజుతో కలిసి కెకె.రాజు ప్రచారం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు అందజేశారు.

55వార్డు పరిధి తాటిచెట్లపాలెం విశ్వతేజ స్కూల్లో టీచర్స్, పేరెంట్స్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కెకె.రాజు హాజరై మాట్లాడారు. ఈ ఎన్నికలలో అందరూ ఆశీర్వదించి తనను ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి, కెవిఎన్.శశికళ, నాయకులు దుప్పలపూడి శ్రీనివాస్, ఆళ్ల శివ గణేష్, గంగ మహేష్, అంబటి శైలేష్, తదితరులు పాల్గొన్నారు.



14వ వార్డులో ప్రచారం చేస్తున్న కెకె.రాజు

వైసిపిలో పలువురు చేరిక

జివిఎంసి 26వ వార్డు పరిధి రామకృష్ణనగర్, చిన్నూరు, లలితానగర్‌కు చెందిన టిడిపి నాయకులు, ముత్యం యువసేన సభ్యులు శుక్రవారం కెకె.రాజు సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో జివి.రవిరాజు, అమ్మాజీ, బ్రాహ్మజీ, రాంబాబు, కిషోర్, సురేష్, రాంబాబు, పాల్గొన్నారు.

ఇటీవలే కాంగ్రెస్ నుంచి వైసిపిలో చేరిన గొంపా గోవిందరాజు ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ పరిధిలోని పలువురు కాంగ్రెస్ నేతలు కెకె.రాజు సమక్షంలో వైసిపిలో చేరారు.

నేరాలు ఘోరాలు

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతినమల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైనట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. కొమ్మాది వికలాంగుల కాలనీకి చెందిన లావణ్య తన కుటుంబ సభ్యులతో నివాసముంటుంది. 2023లో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంట్లో ఖాళీగానే ఉంటుంది. ఈ నెల ఒకటిన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

'ఉపాధి' కూలీలకు శీతల పానీయాలు

ప్రజాశక్తి- ఆనందపురం : భీమిలి నియోజకవర్గం కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజ మండలంలోని బంటుపల్లి వారి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కూలీలను కలిసి సమస్యలనడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావును గెలిపించాలని కోరారు. అనంతరం కూలీలకు ఫలహారం, శీతల పానీయాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు, బంటుపల్లి శ్రీనివాసరావు, బంటుపల్లి గోవిందరావు, శంకర్రావు, మీసాల శ్రీను, దొంతల అప్పలరాజు, వంశీ తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి చరణ్ తేజకు ముత్తంశెట్టి పరామర్శ

ప్రజాశక్తి -తగరపువలస : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న జివిఎంసి రెండో వార్డు నమ్మివానిపేటకు చెందిన నమ్మి చరణ్‌తేజను వారి ఇంటి వద్ద భీమిలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్ర వారం పరామర్శించారు. చరణ్ తేజ తల్లి దండ్రులను ప్రమాద వివరాలడిగి తెలుసుకున్నారు. ఇంటర్ సెకండియర్ పరీక్షలు కూడా రాయలేక పోయినట్లు చరణ్ తేజ తల్లిదండ్రులు వివరించారు.

ఇండోర్ స్టేడియానికి కుర్చీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కుమ్మరిపాలెం ఇండోర్ స్టేడియానికి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫాబ్) ఆధ్వర్యాన శుక్రవారం 10 కుర్చీలు అందజేశారు. స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ నేర్చుకునేందుకు వచ్చే క్రీడాకారులకు, వ్యాయామం చేసేందుకు వచ్చే వారి సౌకర్యార్థం కుర్చీలను అందజేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కాళ్ల సన్నీ, ఎం.సూర్యశ్రీనివాస్, ఎం.గోపి, కె.నరేంద్రకుమార్, షటిల్ బ్యాడ్మింటన్ కోచ్ ఫల్గుణ, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

పింఛనుదారుల ఇబ్బందులు పట్టవా : సిపిఐ

ప్రజాశక్తి -తగరపువలస : పింఛనుదారుల ఇబ్బందులు ఈ ప్రభుత్వానికి పట్టవా అని సిపిఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరి రాంబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పింఛను సొమ్ము లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం తో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు బ్యాంకుల వద్ద క్యూ లైన్‌లో పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో బ్యాంకుల వద్దకు వెళ్తుండడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, సిబ్బందిని ఉపయోగించి ఇంటి వద్దనే పింఛను సొమ్ము అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.అప్పలరాజు, కొండపు ఈశ్వరరావు, సిహెచ్.అప్పలసూరి పాల్గొన్నారు.

గండిగుండంలో ఆరోగ్యసురక్ష

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పిహెచ్‌సి పరిధిలోని గండిగుండం గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గండిగుండం గ్రామం పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 209 మంది వైద్య శిబిరంలో చికిత్స పొందారు. స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ ప్రవీణ్ వర్మ, డాక్టర్ అజ్మాల్, డాక్టర్ బాలాజీ, ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి షహనాజ్ సాధియ రోగులకు వైద్య సేవలందించారు. సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ, కృష్ణమోహన్, సచివాలయ కార్యదర్శి షేక్ మౌలాలి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తా

కూటమి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఈ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు అన్నారు. జివిఎంసి 92వ వార్డు పరిధి ఇందిరానగర్, గోపాలపట్నం ప్రాంతాలలో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, ఇందిరానగర్ ప్రాంత ప్రజాలు తనపై చూపించిన అదరాభిమానం ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. దేవస్థానం భూ సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ప్రజలపై చెత్త పన్నుల భారం మోపుతున్న ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇందిరానగర్‌లో ప్రచారం చేస్తున్న గణబాబు

ఇంటింటా పంచకర్ల సతీమణి ప్రచారం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు పరిధి బంటాకాలనీలో పెందుర్తి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు తరపున ఆయన సతీమణి మహాలక్ష్మి శుక్రవారం సాయంత్రం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతంలో ఈ ప్రాంతంలో రమేష్‌బాబు ఎంతో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఈ ప్రాంతం మళ్లీ అభివృద్ధి చెందాలంటే పంచకర్లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, పార్వతి, మోటూరు చైతన్య, తనకల శ్రీనివాసరావు, జుత్తాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బంటా కాలనీలో ప్రచారం చేస్తున్న పంచకర్ల రమేష్‌బాబు సతీమణి

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
శనివారం
4 మే 2024

కలం మాట



ఓటే మాటాడితే..!

తలా ఓ మాట..
ఓటు ఎవరికేయాలని
ఊరు, ఊరంతా
రాత్రికి రాత్రి రచ్చబండ కాడ
రసవత్తర చర్చ
సీరియళ్లు, సినిమాలు, య్యూట్యూబ్‌లు
అన్నీ బంద్ చేసేసి.
అత్యవసర సమావేశం
ఊర్లో వాళ్లంతా చదువుకోలేదు కానీ,
సుబ్బారావు సూటిగా మాట్లాడడంలో దిట్ట
స్వార్థం లేని మనిషి
నిఖార్సుగా.. నిక్కచ్చిగా..
ఒప్పకపోయినా మెప్పించగలడు.
కానీ తలో ఓ మాట
అందరూ తప్పించుకునే వాళ్లే కానీ
ఒకే తాటిమీదకు తేవడం కష్టం
ఆఖరులో అర్థవంతమైన సారాంశం
మాటా, మాటా కోటలు దాటి
కొట్టుకునేంత వరకు చేరిపోయి
వరదలు ముంచెత్తి, ముంచేసినా
ఒడ్డుకు చేరదు.. ఈ పడవలోని ప్రయాణం
టపీమని కుండబద్దలు కొట్టినట్లుగా
ఓ అవ్వ కామెంట్
కొద్దిసేపటి తర్వాత ఎవరో
సుబ్బారావుకు గొంతెండిపోయింది
సుబ్బారావునే నిలబెడితే పోలా
అరుస్తూ ఎవర...
వెనుక నుంచి బల్లలు చరుస్తూ
ఎట్టకేలకు సుబ్బారావు అసెంబ్లీకి
నేను అసెంబ్లీకి పోను...
నిఖార్సుగానే మాట
ఈ ఊరే నాకు అసెంబ్లీ..
ఈ గుడే నాకు సొంతిళ్లు
మీ కూడు తింటూ.. మీ గుడ్డే కట్టినోడ్ని
ఏం పనులు చక్కబెట్టాలో
తీర్మానం చేయండి...
మీ ఆకాంక్షలు నెరవేర్చని రోజున
నలుగురిలో నిలదీయండి
అంతే.. ఇదిగో తీర్మానం..
అందుకోగలవు.. ఇపుడు గెలుపు గుర్రం
జనం గుండెల్లో నిదురపోయేంతగా
అదే మా ఊరు..
ఇపుడు భారతదేశ చిత్రపటంలో...
ఏకగ్రీవంగా ఎగురుతున్న జెండా కళ్లతోచూడు

పెంటకోట లక్ష్మీనరసింహం,
కవి, రచయిత, పెందుర్తి,
మొబైల్ : 94416 07235

గ్రామాల్లో వైసిపి అభ్యర్థి ధర్మశ్రీ ప్రచారం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ధర్మశ్రీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :మండలంలోని చింతపాక, పంగిడి గ్రామాల్లో వైసిపి చోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ నవరత్నాలు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పాలన వైసీపీ తోనే సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో చింతపాక సర్పంచ్ గోలజన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



పేట పీఠం ఎవరిదో.?



అనకాపల్లి జిల్లాలో ఎస్‌సిలకు కేటాయించిన ఏకైక నియోజకవర్గం పాయకరావుపేటకు సుదీర్ఘ చరిత్ర వుంది. జిల్లా కేంద్రానికి సుమారు వంద కిలోమీటర్లు దూరంలో శివారున ఉన్న పేటలో సవాలక్ష సమస్యలు కొలువుదీరి ఉన్నాయి. ఒకే పార్టీ, ఒకే అభ్యర్థిని పదేపదే గెలిపిస్తే, సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నేటికీ నెరవేరలేదు. ఆదిలో కాంగ్రెస్‌కు, తర్వాత టిడిపి, వైసిపి ఆవిర్భావం తర్వాత ఆయా పార్టీలకు అండగా నిలుస్తూ, కొత్త, పాత అనే తేడాలేకుండా, స్థానికుడా, వేరే ప్రాంతం వాడా అని చూడకుండా గెలిపిస్తూ వస్తున్న పేటవాసుల కష్టాలకు గెలిచిన అభ్యర్థులు మొండిచేయి చూపడం పరిపాటిగా మారింది.

(ప్రజాశక్తి-నక్కపల్లి)

- గెలుపుపై ప్రధాన పార్టీల ధీమా
- సమస్యల పరిష్కారమే తాజా అజెండా
- అభ్యర్థుల మార్పుతో చల్లబడిన గ్రూపుల గోల
- పోటాపోటీగా సాగుతున్న ప్రచారం

పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో కోటవురట్ల, నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాలున్నాయి. 1952లో ఏర్పాటైన పేట నియోజకవర్గంలో అప్పట్లో జనరల్ స్థానం కాగా, తొలి ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి రాజాసాగి సూర్యనారాయణరాజు కాంగ్రెస్ అభ్యర్థి ఎస్‌వి నాయుడుపై గెలుపొందారు. 1962 నుంచి ఎస్‌సిలకు రిజర్వ్ కాబడిన పేటలో ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. మొదట్లో ఇండిపెండెంట్, తర్వాత సిపిఐ, ఆ తర్వాత నాలుగుసార్లు కాంగ్రెస్, ఏడుసార్లు టిడిపి, రెండుసార్లు వైసిపి, అభ్యర్థులు గెలుపొందారు. 1962లో సిపిఐ అభ్యర్థి మండే పిచ్చయ్య కాంగ్రెస్ అభ్యర్థి ఎం.పోతురాజుపై గెలుపొందారు. 1967,1972లో కాంగ్రెస్ తరుపున బరిలో నిలిచిన జి.సూర్యరాయణ ఇండిపెండెంట్ అభ్యర్థి బి.నాగభూషణంపై విజయం సాధించారు. 1978లోనూ ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థి మారుతి ఆదెయ్య కాంగ్రెస్ అభ్యర్థి గారా చిన నూకరాజుపై గెలుపొందారు.

టిడిపి డబుల్ హ్యాట్రిక్

1982లో తెలుగుదేశం ఆవిర్భావం తర్వా 1983 నుంచి 2004 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరసగా ఆరుసార్లు అప్రతిహత విజయాలు సాధించింది. 1983లో టిడిపి అభ్యర్థి గంటెల సుమన కాంగ్రెస్‌అభ్యర్థి ఆర్.నీలపర్తిపై విజయం సాధించారు. టిడిపి అభ్యర్థి కాకర నూకరాజు 1985లో కాంగ్రెస్ అభ్యర్థి జీవి హర్ష కుమార్‌పైనా, 1989, 1994లో కాంగ్రెస్ అభ్యర్థి గంటెల సుమనపై మూడు వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టాడు. 1999లో టిడిపి తరుపున చెంగల వెంకట్రావు కాంగ్రెస్ అభ్యర్థి గంటెల సుమనపై, 2004లోనూ టిడిపి తరుపున చెంగల వెంకట్రావు ఇండిపెండెంట్ అభ్యర్థి గంటెల సుమనపై గెలుపొందారు. టిడిపి వరుస విజయాలకు 2009లో కాంగ్రెస్ అభ్యర్థి గొల్ల బాబూరావు గండికొట్టి, చెంగల వెంకట్రావుపై గెలుపొందారు. 2009లో వైసిపి ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ తరపున గొల్ల బాబూరావు పోటీలో నిలిచి, టిడిపి అభ్యర్థి చెంగల వెంకట్రావుపై గెలిచారు. 2014లో టిడిపి అభ్యర్థిగా వంగలపూడి అనిత, వైసిసి అభ్యర్థి చెంగల వెంకట్రావుపై విజయం సాధించారు. 2019లో వైసిపి అభ్యర్థి గొల్ల బాబూరావు టిడిపి అభ్యర్థి డాక్టర్ బి.బంగారయ్యపై గెలుపొందారు.

అసమ్మతి రాగాలు... కొత్త ముఖాలకు స్థానాలు

ఎస్‌సిలకు కేటాయించిన పేట నియోజకవర్గంలో ఇతరుల ఆధిపత్యం కూడా ఉండడంతో అధికారంలో ఉన్న నేతలపై అసమ్మతి పరిపాటిగా మారింది. పేట ప్రస్తుత ఎమ్మెల్యే, వైసిపికి చెందిన గొల్ల బాబూరావుకు ఇక్కడ కాంగ్రెస్ తరపున ఒకసారి, వైసిపి తరపున రెండుసార్లు గెలుపొందగా, అతనిపై అసమ్మతి పెరగడంతో రాజ్యసభకు పంపి, ఆ స్థానంలో రాజాం సిటింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులుకు వైసిపి కేటాయించింది. ఇక కూటమి తరపున బరిలో ఉన్న టిడిపి అభ్యర్థి వంగలపూడి అనితకు అధికారంలో ఉండగా, అసమ్మతి పోరు తప్పలేదు. 2014లో విజయం తర్వాత అనితపై అసమ్మతి పెరగడంతో 2019 ఎన్నికల్లో ఆమెను కొవ్వూరు నియోజకవర్గానికి పంపి, బంగారయ్యను టిడిపి పోటీలో నిలిపింది.

ఆసక్తికరంగా తాజా ఎన్నికలు

తాజా ఎన్నికలలో పేటలో ఎవరు గెలుస్తారనేది ఆసక్తికరంగా ఉంది. టిడిపిలో ఫైర్‌బ్రాండ్‌గా ఉన్న వంగలపూడి అనితకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన తర్వాత పార్టీ కేడర్, ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోని పార్టీ శ్రేణుల సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్‌లో ఇళ్లు నిర్మించుకుని, అక్కడే ఉంటూ స్థానికతను చాటుకున్నారు. తాజా ఎన్నికల్లో. తెలుగుదేశం, జనసేన, బిజెపి కేడర్ అంతా ఆమె గెలుపుకోసం ఆహర్నిశలు శ్రమిస్తున్నాయి. పలు గ్రామాల్లో వైసిపి నుంచి చేరికలు గెలుపుపైధీమా పెంచుతూ, పార్టీ కేడర్‌లో జోష్ కనిపిస్తోంది.



ఇకసిటింగ్ ఎమ్మెల్యే గొల్లబాబూరావుపై అసమ్మతి పెరగడంతో ఆయనను రాజ్యసభకు పంపిన వైసిపి అధిష్టానం, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులుకు టిక్కెట్ కేటాయించింది. పాలకొండ, రాజాం నియోజకవర్గాల్లో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జోగులుకు ఇక్కడ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించి తర్వాత వైసిపిలో గ్రూపులగోల తగ్గిందనే చెప్పాలి. నియోజకవర్గానికి కొత్త ముఖం, స్థానికేతరుడైనప్పటికీ, కొత్తవాళ్లను ఆదరించడంలో పేట ఓటర్లు ముందుంటారన్న గత ఫలితాలను, సిఎం జగన్ ఛరిష్మా, వైసిపి సంక్షేమ పథకాలు గెలిపిస్తాయన్న ధీమాతో ముందుకు సాగుతున్నారు.

ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ బోని తాతారావు పోటీలో నిలిచారు. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఇతర ఫోరం పార్టీలతోపాటు ప్రజాసంఘాల మద్దతుతో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గత ప్రభుత్వాల వైఫల్యాలు, నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు అజెండాగా ప్రచారం సాగిస్తున్నారు, ఎపికి ప్రత్యేకహోదా, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, ఇందిరమ్మ అభయహస్తం, ఇతర ఫోరం మేనిఫెస్టోలోని పథకాలను వివరిస్తూ ప్రచారం సాగిస్తున్నారు.

పాయకరావుపేటలో ఓటర్లు

మొత్తం ఓటర్లు	:2,47,508
పురుషులు	: 1,21,911
మహిళలు	:1,25,595
పోలింగ్ బూత్‌లు	: 292

ప్రధాన పోటీ అభ్యర్థులు వీరే...


కంబాల జోగులు, వైసిపి
వంగలపూడి అనిత, టిడిపి
బోని తాతారావు, కాంగ్రెస్

పేటలో ప్రధాన సమస్యలివే..

- ★ తాగు,సాగునీరు సమస్యలు :152 గ్రామాలకు తాగునీరు అందించే ఉద్దండపురం ప్రాజెక్టు పూర్తి చేయడం, పోలవరం ఎడమ కాలువ నీటిని లిఫ్ట్ ద్వారా పంటపొలాలకు సాగునీరు అందించడం.
- ★ నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు
- ★ వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూనిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ చెల్లింపు. హానిరహిత పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పన.
- ★ రాజయ్యపేట వద్ద హెటిరో డ్రగ్స్ అదనపు పైపులైను నిలుపుదల. కంపెనీ వ్యర్థ జలాలు సముద్రంలోకి విడుదల చేయకుండా చర్యలు
- ★ నక్కపల్లిలో డిగ్రీ కళాశాలకు సొంత భవనం, పూర్తి స్థాయిలో అధ్యాపకుల నియామకం
- ★ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు
- ★ బిసి రెసిడెన్సియల్ కాలేజీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ ఏర్పాటు
- ★ ఎస్.రాయవరం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు
- ★ తాండవ,వరహా నదులకు ఇరువైపులా పటిష్టమైన గట్లు నిర్మాణం
- ★ తాండవ,ఏటికొప్పాక సుగర్ ప్యాక్టరీలను తెరిపించడం
- ★ మత్స్యకారుల జీవనోపాధికి సముద్రతీరంలో జెట్టీ నిర్మాణం
- ★ కోటవురట్ల మండలం జల్లూరు, యండపల్లి,పందూరు వద్ద వరహానదిపై వంతెన నిర్మాణాలు పూర్తిచేయడం

పశ్చిమ అభివృద్ధికి కృషి

- ఇంటింటి ప్రచారంలో సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల


లక్ష్మీనగర్‌లో ప్రచారం చేస్తున్న సిపిఐ అభ్యర్థి విమల, ఇతర నాయకులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని ఇండియా ఫోరం బలపర్చిన సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల చెప్పారు. గోపాలపట్నం లక్ష్మీనగర్ ఇ, ఎఫ్ బ్లాకుల్లో, పారిశ్రామిక ప్రాంతం జనతా కాలనీ, ఇందిరా కాలనీ-1, అంబేద్కర్ జంక్షన్, మర్రిపాలెం తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా అభ్యర్థి అత్తిలి విమలకు జనాలు హారతులు పట్టి స్వాగతించారు. కమ్యూనిస్టుల వాణి రాష్ట్ర అసెంబ్లీలో వినిపించాలని, అందుకు నేడు జరుగుతున్న ఎన్నికలు మంచి పరిణామమని విమల పేర్కొన్నారు. ధనరాజకీయాలు రాజ్యమేలుతున్న తరుణంలో నిరంతరం ప్రజల మధ్య ఉండే వామపక్ష వాదులకు పట్టంకట్టాలని కోరారు. బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించి రాష్ట్రాన్ని రక్షించాలని, కేంద్రంలో బిజెపిని ఓడించడం ద్వారా రాష్ట్రంలో వైసిపి, టిడిపిలకు ముకుతాడు వేయొచ్చని ఓటర్లకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి సిపిఐ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, ఎస్‌కె.రెహమాన్, ఆర్.శ్రీనివాసరావు, జి.రాంబాబు, సిపిఐ అనకాపల్లి జిల్లా నేతలు జి.గురుబాబు, అర్జున్, వై.రాంబాబు, గండి అప్పారావు, క్రాంతి, ఇండియా ఫోరం నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో రాష్ట్రం అభివృద్ధి

- ఇండియా ఫోరం ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి రామారావు


మురళీనగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాంగ్రెస్ పార్టీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు అన్నారు. మురళీనగర్, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ విధివిధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్తర నియోజకవర్గంలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అక్కయ్యపాలెం ప్రాంతంలో ముస్లిం పెద్దలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటింగ్‌పై అవగాహనకు బీచ్‌రోడ్డులో భారీ ఇవిఎం నమూనా

సార్వత్రిక ఎన్నికల వేళ ఓటింగ్‌పై అవగాహనకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారయంత్రాంగం సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విశాఖ బీచ్‌రోడ్డులోని పార్కులో భారీ ఇవిఎం నమూనాను ఏర్పాటు చేశారు. చూపరులను ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన దీన్ని పలువురు తిలకిస్తూ, ఎన్నికల గురించి, ఓటింగ్‌పై చర్చించుకోవడం ద్వారా సత్ఫలితాలు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. గత ఎన్నికల కంటే మెరుగైన పోలింగ్‌శాతం కోసం అధికారుల వినూత్న చర్యలు ఓటర్లలో చైతన్యాన్ని, ఆసక్తిని కలిగిస్తుండడం విశేషం.

(ప్రజాశక్తి-విశాఖపట్నం)




వంశీకృష్ణ సతీమణి ప్రచారం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో బిజెపి, టిడిపి, జనసేన కూటమి బలపరిచిన జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకష్ణ శ్రీనివాస్ యాదవ్ సతీమణి పద్మజ 30వ వార్డు సూపర్ బజార్, పూర్ణ మార్కెట్ ఏరియాలోనిజైన్, మార్వాడీ అపార్ట్‌మెంట్లను సందర్శించి, విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు, పద్మజ ప్రచారానికి విశేష స్పందన లభించింది, జైన్, మార్వాడీ అందరూ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, విశాఖ ఎంపీగా ఎం.శ్రీభరత్‌కు తమ ఓటు వేస్తామని భరోసానిచ్చారు. ప్రచారంలో 30వ వార్డు టిడిపి నాయకులు గోకాడ శ్రీనివాసరావు, అరవింద్ జైన్, వికాస్ రెడ్డి, టిడిపి ,జనసేన బిజెపి నేతలు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు


ప్రచారం చేస్తున్న దక్షిణ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ సతీమణి పద్మజ

ఇవిఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి

ప్రజాశక్తి- విశాఖపట్నం: విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో వినియోగించనున్న ఇవిఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. ఇదివరకే ర్యాండమైజేషన్ పూర్తయినప్పటికీ పార్లమెంటు బరిలో 33 మంది అభ్యర్థులు పోటీ పడుతుండడంతో అదనంగా బ్యాలెట్ యూనిట్ వినియోగిస్తున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ, రాజకీయ పార్టీల అభ్యర్థుల సమక్షంలో స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పార్లమెంటు నియోజకర్గ పరిధిలో ఉన్న 1,800 పైచిలుకు పోలింగ్ కేంద్రాల్లో వినియోగించేందుకు అనువుగా ఆన్‌లైన్ విధానం ద్వారా ఇవిఎంలను కేటాయించారు. ఇవిఎంల నోడల్ అధికారి టి. ప్రవీణ, ఎన్నికల సెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అభ్యర్థుల సమక్షంలో ప్రక్రియను నిర్వహించిన జిల్లా కలెక్టర్ మల్లికార్జున

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని ఈదులపాక బోనంగి గ్రామానికి చెందిన వైసిపి ఉప సర్పంచ్ మేడశెట్టి వెంకట రమణ, వెంకట సత్యవతి ఆధ్వర్యాన పలువురు వైసిపి నాయకులు పెందుర్తి మండలం సుజాతనగర్‌లో పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు నివాసంలో ఆయన సమక్షంలో శుక్రవారం జనసేనలో చేరారు. జనసేనలో చేరిన వారిలో బొద్ధపు అర్జున నరసింగరావు, రాయి నీలబాబు, బొండా తారక రమేష్ కుమార్, మేడశెట్టి శంకరరావు ఉన్నారు. కార్యక్రమంలో ఈధులపాక బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్ కాసులు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెం పంచాయతీ శివారు చిన బంగారమ్మ పాలెం గ్రామంలో వైసిపి నుండి జనసేన పార్టీలో సుమారు వంద మంది కార్యకర్తలు మండల శెట్టిబలిజ సంఘ నాయకులు తాటిపాముల శేఖర్ ఆధ్వర్యంలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో బలిరెడ్డి అప్పారావు, శరగడం రాము, కర్రి కనకరాజు, బంతి కోళ్ల పద్మ, తాటిపాముల శేఖర్, చిట్టిబోయిన నూక అప్పారావు, కోటి పాల్గొన్నారు.



జనసేనలో చేరిన చిన బంగారమ్మపాలెం వైసిపి నాయకులు

వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం



కశింకోట మండలంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న భరత్

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని కూండ్రం, రొంగలివానిపాలెం, కుంచంగి, వేటజంగాలపాలెం గ్రామలలో గురువారం రాత్రి అభ్యర్థి మలసాల భరత్ కుమార్, ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు ప్రచారం నిర్వహించారు. నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు పాల్గొన్నారు. జీవీఎంసీ 82వ వార్డు పరిధి న్యూ కాలనీలో కార్పొరేటర్ మందపాటి సునీత, జానకిరామరాజు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు డాక్టర్ రామ్మూర్తి, పలకా రవి పాల్గొన్నారు. జివిఎంసి 81వ వార్డ్‌లో కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు నేతృత్వంలో అభ్యర్థులు మలసాల భరత్‌కుమార్, బూడి ముత్యాల నాయుడు, ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి, మలసాల భరత్ సతీమణి నివేదిత, మలసాల భరత్ సోదరి మాధురి తదితరులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంపీ బివి సత్యవతి, వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, మలసాల భరత్ పాల్గొని మాట్లాడారు.

కశింకోట : అనకాపల్లి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ మండలంలోని ఉగ్గినపాలెం, పరవాడపాలెం గ్రామాల్లో శనివారం ఉపాధి హామీ కూలీలను పని ప్రదేశాల్లో కలిశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనకు ఒక్క అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, నాయకులు గొల్లవిల్లి శ్రీనివాసరావు, గొంతిన శివ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని ఇరువాడ, బాటజంగాలపాలెం, గాలి భీమవరం, గొట్టివాడ, అసకపల్లి, పైడివాడ గ్రామాల్లో శుక్రవారం వైసిపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నం రెడ్డి అదీప్ రాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గాంధీ, కర్రి బాబు, బలిరెడ్డి కనకరాజు, సబ్బవరపు నారాయణమూర్తి, బోకం రామునాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ గ్రామంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, వైసిపి నాయకులు చుక్క రాము నాయుడు, ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, వర్రి పైడం నాయుడు, పైల హరీష్, వర్రి లక్ష్మి, పోతల అప్పల నాయుడు, పైల వెంకటరావు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని వెంకటాపురం, టి.శిరసపల్లి, తోటాడ, ఉమ్మలాడ గ్రామాలలో గురువారం రాత్రి ఎలమంచిలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి యువి రమణ మూర్తి రాజు (కన్నబాబురాజు), వైసిపి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ముత్యాల నాయుడులను గెలిపించాలని కోరారు.

కూటమి నేతల ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ శుక్రవారం ఉదయం జీవీఎంసీ 81వ వార్డు నిదానం దొడ్డి రైతు సంఘం వీధి గౌరీ సంఘం వీధి సత్తమ్మ తల్లి ఆలయం వీధి ప్రాంతాల్లో కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో గురువారం రాత్రి అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ ప్రచారం నిర్వహించారు. ప్రజలు సంక్షేమ కావాలంటే కూటమి అభ్యర్థులు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సినీ నటుడు సప్తగిరి, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బుద్ధ నాగ జగదీష్, దాడి రత్నాకర్ పాల్గొన్నారు.

బండారుకు మద్దతుగా మాజీ ఎంపిపి ప్రచారం

దేవరాపల్లి : మాడుగుల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తికి మద్దతుగా తాజా మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం బండారు సతీమణి మాధవీలతో కలిసి ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. బండారు సత్యనారాయణమూర్తిని గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామ ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు అభిప్రాయం మేరకు కిలపర్తి దంపతులు కూటమికి మద్దతు పలికారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ మాలిబాబు, ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, జి.మురళి, గుల్లిపల్లి అర్జునరావు, గొర్లె దేముళ్ళు, గవిరెడ్డి దేముళ్ళు, బండారు అప్పలనాయుడు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాజీ ఎంపిపి రాజేశ్వరి తదితరులు

బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్‌ను ఓడించాలి

సిపిఎం నాయకులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి : అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ ఇతర ప్రాంతాల నుండి వేలాది మంది కషాయ మూకలను మోహరించి ఎలాగైనా గెలవాలని ప్రయత్నిస్తున్నారని, ప్రజలు ప్రజలు అప్రమత్తంగా ఉండి బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్‌ను ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సిఎం రమేష్ లాంటి పారిశ్రామిక వేత్తలను వలస తీసుకువచ్చి అనకాపల్లి పార్లమెంట్‌లో పోటీ చేయించి బిజెపి ఎలాగైనా గెలవడం కోసం 5వేల మంది కిరాయి మనుషులు తీసుకొచ్చి డబ్బు, మద్యం పంపాకానికి సిద్ధం చేసిందని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదామని, ఇటువంటి వ్యక్తులను పార్లమెంటుకు పంపిస్తే తీవ్ర నష్టం జరగుతుందన్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. మోడీ మరోసారి గెలిస్తే భవిష్యత్‌లో ఎన్నికలు ఉండవని, రాజ్యంగాన్ని పూర్తిగా రద్దు చేస్తారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. బిజెపి, ఎన్‌టిసి కూటమిని ఓడించి, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని వెంకన్న కోరారు.

పశువులు, జీవాల సంరక్షణపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి- కశింకోట

వేసవి ప్రభావంతో ప్రస్తుతం వడగాడ్పులు ఎక్కువగా ఉన్నందున పశువులు, జీవాల సంరక్షణపై శ్రద్ధ వహించాలని పశువైద్యాధికారి డాక్టర్ చైతన్య మణి సూచించారు. పాడి పశువులను ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో మేతకు బయటకు వదలరాదని, ఉదయం 9 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తర్వాత వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే మేతకు వదలాలని సూచించారు. తాగే నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలన్నారు. రోజుకి మూడు నాలుగు పర్యాయాలు చల్లని నీటితో పశువులను కడగాలని, దాణాలో మినరల్ మిక్చర్ కలిపి పెట్టాలని, తగినంత ఉప్పు శాతం ఉండేలా చూసుకోవాలని చెప్పారు. గొర్రెలు మేకల సంరక్షణ కోసం ఉదయం సాయంత్రం చల్లని వేళల్లో మేపుతూ, మధ్యాహ్నం నీడలో విశ్రాంతి కల్పించాలని, చూడితో ఉన్న వాటిని, రెండు నెలల లోపు పిల్లలతో ఉన్న తల్లులని పాకవద్దే ఉంచి సరైన మేత అందించాలని, చల్లని పరిశుభ్రమైన నీటిని అందించాలని, అన్నిటికీ నట్టల నివారణ మందులు వేయించాలని సూచించారు. నాటు కోళ్లను పెంచేవారు నిరంతరం గాలి తగిలేలా షెడ్లను ఏర్పర్చుకోవాలని, కోళ్ల మీద ఎండ వేడి ప్రభావం పడకుండా షెడ్ల మీద తాటి పీచుతో కప్పి వాటిని తడుపుతూ ఉండాలని, విటమిన్లు తాగించాలని, వడదెబ్బకు గురైన కోళ్లను గుర్తించి వాటిని మామూలు కోళ్ల నుంచి వేరు చేయాలని, ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు వేయించాలని కోరారు.

స్కౌట్ అండ్ గైడ్‌లో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కశింకోట

ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రం పంచుమారిలో జరిగిన జాతీయ స్థాయి స్కౌట్ అండ్ గైడ్ అడ్వాన్చరీ పోటీల్లో కశింకోట సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రతిభ కనుబర్చారుఉ. వీరిలో పదవ తరగతి చుదువుతున్న పి మహేష్, ఎన్.కళ్యాణకుమార్, బి.ప్రియాంక, జి.పురుష్ బహుమతులు సాధించారు. వీరిని పాఠశాలలో శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బి అనురాధ, స్కూల్ డైరెక్టర్ నోబెల్ కుమార్, ప్రిన్సిపాల్ రూపనంద పాల్గొన్నారు.

సమస్యలతో గిరిపుత్రులు సతమతం

-తాగునీటికి అవస్థలు-అసంపూర్తిగా రోడ్డు, అంగన్‌వాడీ కేంద్రం- ఇదీ కోదండరామపురం గ్రామం దుస్థితి

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో కొడవటిపూడి శివారు కోదండరామపురం గిరిపుత్రుల గోడు పట్టించుకునే వారు ఎవరూ లేరు. గ్రామంలో సుమారు 36 కుటుంబాలు 180 మంది ప్రజలు ఉన్నారు. కొడవటిపూడి గ్రామానికి కూతవేటు దూరంలోనే ఉన్నా ఎన్ని ప్రభుత్వాలు మారినా గ్రామానికి కనీసం తాగేందుకు నీటి సౌకర్యం లేదు. ఒకే ఒక్క బోరుతో అవస్థలు పడుతున్నారు. గ్రామానికి 1.30 కోట్లతో మంజూరైన రోడ్డు నిర్మాణ పనులు కూడా అసంపూర్తిగా వదిలేసారు. రెండు చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా పట్టించుకోలేదని గిరి పుత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు నామమాత్రంగానే చేసిందని, ఒకవేళ మంజూరు చేసినా కట్టుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో గ్రామంలో ఇంకా పూరి గుడిసెల్లోనే నివాసం ఉంటున్నారు. అసంపూర్తి రోడ్డుకు తోడు సాయంత్రం చీకటి పడితే దారిన వెళ్లేందుకు కనీసం వీధిలైట్లు కూడా లేవు. సుమారు మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉన్నందున చీకటి పడితే ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనాటి టిడిపి ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టిన అంగన్వాడి భవనం నేటికీ పూర్తికాక అసంపూర్తిగానే దర్శనమిస్తుంది. దీంతో పూరి గుడిసెలో అంగన్వాడి కేంద్రం నిర్వహిస్తున్నారు. గ్రామంలో చదువుకునే విద్యార్థులు కొడవటిపూడి వచ్చి చదువుకోవలసి ఉన్నందున రెండు గెడ్డలు దాటి పాఠశాలకు వెళ్లాల్సి ఉంది. వర్షాలు అధికంగా కురిస్తే చదువుకుంటున్న విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పలువురు విద్యార్థులకు నేటికీ అమ్మఒడి అంత లేదని, స్కాలర్షిప్పు కూడా రాకపోవడం పట్ల అవస్థలు పడుతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, కనీసం తాగడానికి నీళ్లు కూడా లేకపోవడం, రహదారి నిర్మాణం అసంపూర్తిగా వదిలివేయడంతో పలువురు గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అసంపూర్తిగా ఉన్న అంగ్‌వాడీ కేంద్రం భవనం



గ్రామంలో మట్టి రోడ్డు



గ్రామంలో ఉన్న పూరి గుడిసె, పెంకుటిల్లులు

పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు

పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడవలసిన పరిస్థితి నెలకొంది. గ్రామానికి రహదారి సక్రమంగా లేక పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నేటికీ అమ్మ ఒడి, స్కాలర్షిప్పు అందలేదు. అధికారులు మంజూరు చేయాలి,...



అనూష ,కీర్తన,
విద్యార్థులు

ఎవరు పట్టించుకోలేదు

మమ్మల్ని ఎవరు పట్టించుకోలేదు. ఎన్నికలప్పుడు వాగ్దానాలు చేస్తున్నారు కానీ కనీసం తాగడానికి నీళ్లు కూడా ఇవ్వలేదు. ఒకే ఒక్క బోరుతో గ్రామస్తులు నెట్టుకు వస్తున్నాము.



మహాలక్ష్మి,
గ్రామస్తురాలు

వైసిపి అభ్యర్థులు జోగులు, అనునాధల ప్రచారం

ప్రజాశక్తి - చీడికాడ:సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మాడుగుల నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈ అనురాధ శుక్రవారం మండలంలోని బయలుపూడి గ్రామంలో ప్రచారం చేపట్టారు. ఉపాధి హామీ కూలీలతో కలిసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందజేశారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూడా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా అనురాధ, పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయుచున్న తన తండ్రి ముత్యాలనాయుడులకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అనురాధ అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, మండల పార్టీ కన్వీనర్ రాజబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

నక్కపల్లి: మండలంలోని ఉపమాక, సీతంపాలెం, పెద దొడ్డి గల్లు గ్రామాల్లో శుక్రవారం పాయకరావుపేట నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ప్రచారం చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, నాయకులు కృష్ణ, రమణ, కొప్పిశెట్టి హరిబాబు, సిద్దాబత్తుల నూక తాత, కొల్లాటి బుజ్జి, రవి, ఎలమంచిలి తాతబాబు, తాతారావు, బాబురావు,శేషారత్నం, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలోకి పలువురు చేరికలు

అనకాపల్లిడెస్క్:మాకవరపాలెం మండలం పాపయ్యపాలెం, కొత్తపాలెం గ్రామానికి చెందిన 100 కుటుంబాలు టీడీపీ నుంచి వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో వైసీపీ హయాంలో అందించిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో నర్సీపట్నం నియోజకవర్గంలో 30వేల మెజార్టీతో గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



నక్కపల్లి మండలంలో ప్రచారం చేస్తున్న జోగులు

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి ముంచింగి పుట్టు : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ , ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో గిరిజన ప్రాంతంలోని యువత మృత్యు వాతపడుతున్నారు. . మండలానికి చెందిన కుమ్మడ పంచాయతీ పూలబంధ గ్రామంలో కిల్లో వెంకట్రావు భీమవరం రొయ్యల చెరువు పనుల్లో ఉపాధికి వెళ్లాడు. అక్కడ పని చేస్తున్న సమయంలో విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మే 1న మృతి చెందాడు. గురువారం రాత్రి మృతదేహాన్ని పూల బంధ గ్రామానికి తరలించారు. మండల వైస్ ఎంపీపీ 1 పాటు పోయి సత్యనారాయణ, సిపిఎం మండల కమిటీ సభ్యుడు ఎంఎం శ్రీను లు శుక్రవారం గ్రామంలో వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.
అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ, మన్యంలో ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో గిరిజన ప్రాంతంలో ఉన్న యువత ప్రైవేటు కర్మాగారాల్లో మృతి చెందుతున్నారన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సిపిఎం నేతలు పాంగి చిన్ని బాబు ఉన్నారు.



ఓటింగ్‌కు బయలుదేరిన ఎన్నికల సిబ్బంది

హోమ్ ఓటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి:పాయకరావుపేట నియోజక వర్గంలోని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి హెూమ్ ఓటింగ్ ప్రక్రియను ఆర్వో గీతాంజలి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ మేరకు నక్కపల్లి ఆర్ఓ కార్యాలయం నుండి ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల సమక్షంలో ఎన్నికల సిబ్బందికి బ్యాలెట్ బాక్స్ లు, సామగ్రిని అందజేశారు. ఏడు టీములు బయలుదేరి వెళ్లారు. పాయకరావుపేట నియోజకవర్గం లో సీనియర్ సిటిజన్స్ (85 సంవత్సరాలు దాటిన వారు), దివ్యాంగులు ఇంటి వద్ద ఓటింగ్ ప్రక్రియ చేపట్టే విధంగాను 217 మంది హెూమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సెక్టోరియల్ అధికారుల ఆధ్వర్యంలో, భద్రత సిబ్బంది పర్యవేక్షణలో హెూమ్ ఓటింగ్ చేపట్టారు. నక్కపల్లి, రాజీవ్ నగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు ముద్దా సన్యాసమ్మ హోమ్ ఓటింగ్ వేసింది.

వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండల కేంద్రంలో బాలవికాస్ వారోత్సవాలు వేసవి శిక్షణ తరగతుల సందర్భంగా గైరంపేట భజన మండలిలో వేసవి వెన్నెల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాసి పిల్లలచే తల్లిదండ్రులకు పాద పూజ చేశారు. ఈ కార్యక్రమంలో 15 మంది బాలవికాస్ పిల్లలు 15 మంది తల్లులు భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా జ్యోతి సమన్వయకర్త, మండల ఇంచార్జ్, మండల గ్రామ సేవా ఇంచార్జ్, గైరంపేట కన్వీనర్ పాల్గొన్నారు.



కవాతు చేపడుతున్న పోలీసులు

కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ ఎస్సై కృష్ణారావు ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తఎల్లవరం, గుండుపాల, చీడిగుమ్మల, యర్రవరం, పాకలపాడు గ్రామాల్లో కేంద్ర బలగాలు ఆర్పీఎస్ఎఫ్ సిబ్బందితో శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, గ్రామాల్లో ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అంధకారం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అంధకారంలోని నెట్టబడిందని మాజీ మంత్రి, నర్సీపట్నం ఎన్డీఏ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. వస్తున్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి జంక్షన్ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, నర్సీపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎన్నికల ముందు మద్యపానం నిషేదం అని చెప్పి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారన్నారు. 25 రూపాయలు విలువ చేసే మద్యాన్ని 240 రూపాయలకు అమ్మకాలు చేస్తూ పేదల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో కనీసం గుంతలు పూడ్చలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న ఆదారి

ముస్లిముల మద్దతు కోరిన ఆడారి

ప్రజాశక్తి -గోపాలపట్నం, ములగాడ : జివిఎంసి 57, 58 వార్డుల పరిధిలోని మసీదులను పశ్చిమ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సందర్శించారు. మసీదులలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని ముస్లిం పెద్దలను విజ్ఞప్తి చేశారు. ముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కేవలం నామినేటెడ్ పదవిలో ఉన్నప్పుడే ఎంతో అభివృద్ధి చేసిన తాను, ఎమ్మెల్యే అయితే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

గోపాలపట్నం : ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ జివిఎంసి 92వ వార్డు పరిధి వెంకటాపురంలో వైసిపి నాయకులు బెహరా భాస్కరరావు ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా ఆనంద్‌కుమార్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక టౌన్ ఫీడర్, 11 కెవి రూరల్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం భీమిలి చిన్న బజారు, కేటీన్ పేట, బ్యాంక్ కాలనీ, మహాలక్ష్మిపురం, రేఖవానిపాలెం, రాయిపాలెం, మూలకుద్దు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఇఇ పోలాకి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వార్డుల్లో సిపిఎం, కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి -గాజువాక : ఇండియా ఫోరం బలపర్చిన గాజువాక నియోజకవర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న సత్యారెడ్డి శుక్రవారం 73వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు పరిధిలోని సింహగిరి కాలనీ, పైడిమాంబ కాలనీ, సనత్‌నగర్, గొంతివానిపాలెంలో ఇంటింటికీ వెళ్లి ఉమ్మడిగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేగా సిపిఎం అభ్యర్థి జగ్గునాయుడును, ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సత్యారెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. స్థానికులు పెద్ద ఎత్తున హారతులిచ్చి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ రక్షణ, గంగవరం పోర్టు, విశాఖ డెయిరీ కాలుష్యం, గాజువాక హౌస్ కమిటీ సమస్య, ట్రాఫిక్, గాజువాకలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు తదితర సమస్యలపై మాట్లాడేందుకు చట్టసభకు పంపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగ రక్షణ కోసం తమను గెలిపించాలని కోరారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితే ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్ సాధ్యపడుతుందన్నారు. అనంతరం 66వ వార్డులో ఉన్న మసీదుకు వెళ్లి ముస్లిం సోదరులను కలిసి తమను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, డి.లోకేష్, రమణ, బంగారు నాయుడు, కిరీటం, పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ఎం.జగ్గునాయుడు, సత్యారెడ్డి

సంక్షేమ పథకాలే విజయానికి దోహదం

ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : వైసిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం జివిఎంసి రెండో వార్డు పరిధిలోని నమ్మివానిపేట, బ్యాంక్ కాలనీ, రాయిపాలెం ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలే తన విజయానికి దోహద పడతాయన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

స్థానిక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో కాంగ్రెస్, బిఎస్‌పి నుంచి పలువురు కార్యకర్తలు శుక్రవారం వైసిపిలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారికి ముత్తంశెట్టి కండువాలు వేసి వైసిపిలోకి ఆహ్వానించారు. ముత్తంశెట్టి విజయానికి తామంతా కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రెండో వార్డులో ప్రచారం చేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

నరసింహనగర్‌లో 'జైభారత్' ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : జై భారత్ నేషనల్ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ శుక్రవారం నరసింహనగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా గెలిస్తే నీతి నిజాయతీగా పనిచేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మద్యం పంచే వ్యక్తులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ టార్చ్ లైట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ సమయం అదనంగా 2 గంటలు పెంచండి

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయాన్ని అదనంగా మరో రెండు గంటలు పెంచాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు లేఖ రాసినట్లు లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి తెలిపారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ లేఖను విడుదల చేసి, మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎండల తీవ్రతను గుర్తించి, ఓటు వేయడానికి వచ్చే వృద్ధుల పరిస్థితిని అంచనా చేయాలని కోరారు. ఏపిలో మొత్తం 4.14 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 46,389 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారని, ఒక్కో పోలింగ్ కేంద్రంలో సుమారుగా 1500 ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఎండకి తట్టుకోలేక సాయంత్రం వచ్చే ఓటర్లుతో పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీ పెరిగేకొద్దీ సిబ్బందికి ఇబ్బందులు పెరుగుతాయని, అందుకే సమయం పెంచాలని కోరారు. రాష్ట్రంలో కొంతమంది వాలంటీర్లు అధికార పార్టీకి ప్రచారం చేస్తూ బాధ్యత మరిచి ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కనుబుద్ది నరసింగరావు, కొలసాని రమణ, ఆడారి శ్రీనివాసరావు, సాలపు మధు పాల్గొన్నారు.

ఘనంగా ఐఎన్‌టియుసి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-పరవాడ

ఐఎన్‌టియుసి 78వ ఆవిర్భావ దినోత్సవం మండలంలోని దీపాంజలి నగర్ యూనియన్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎన్టీపిసి సింహాద్రి హెచ్ఓపి సంజయ్ కుమార్ సిన్హా హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం వందే భారత్ బ్లడ్ సెంటర్ వారి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. 100 మందికి పైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌టిపిసి జిఎం ఎస్‌జె డేవిడ్, హెచ్ఒహెచ్ ఆర్‌బిబి పాత్రా, టీసీ సిఐఎస్ఎఫ్ వి.ప్రభాకర్, సీఎంఓ కె.విజయ, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజెపి లెనిన్, జనరల్ సెక్రెటరీ బి భీమరాజు, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆర్.లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధం

ఎన్నికల సాధారణ పరిశీలకులు దర్జీత్ సింగ్ మంగత్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎన్నికల అధికారులు

ప్రజాశక్తి- అనకాపల్లి

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు ఎన్నికల సాధారణ పరిశీలకులు దర్జీత్ సింగ్ మంగత్ తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్ 4వ దశ ఎన్నికలు జరిగే రాష్ట్రాల ఎన్నికల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనకాపల్లి జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న దర్జీత్ సింగ్ మంగత్ మాట్లాడుతూ ఎన్నికలకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలను తీసుకుంటున్నట్లు చెప్పారు. పోలీస్ అబ్జర్వర్ రాకేష్ కుమార్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు ఏర్పాటు అయ్యాయని, స్వయంగా పరిశీలించామని తెలిపారు. పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు గోపాలస్వామి మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు, అంతర్ జిల్లాల చెక్ పోస్టులు ఏర్పాటు ఉన్నాయని ఎప్పటికప్పుడు సీజర్ అంశాలు, ఎన్నికల వ్యయ పరిశీలన జిల్లాలో పక్కాగా ఉన్నాయని పేర్కొన్నారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి మాట్లాడుతూ రాజకీయ పార్టీల అభ్యర్థులతో సమావేశం నిర్వహించి తదుపరి ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులు బిఎల్ఓల ద్వారా సంబంధిత ఓటరుకు పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. శత శాతం వెబ్ కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్ నియామకం అవసరమైన మేరకు వీడియోగ్రాఫీ చేపడుతున్నామని చెప్పారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పాక్షిక పారదర్శక ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని వివరించారు. కనీస మౌలిక సదుపాయాలు పోలింగ్ కేంద్రాలలో కల్పించడంతో పాటు షెడ్, వీల్ చైర్స్, ర్యాంపు, మెడికల్ టీమ్ ఫ్లూయిడ్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎస్పీ కెవి.మురళీకృష్ణ మాట్లాడుతూ సెన్సిటివ్ కేంద్రాలలో ఎటువంటి సంఘటనలు జరగకుండా ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పరిశీలకులు ఎన్.సంజయ్ గాంధీ, ఆశిష్ కుమార్ పాండే , నియోజకవర్గాల ఆర్‌ఓలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఐఐహెచ్‌టి డిప్లమో కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ వెంకటగిరి, తిరుపతి జిల్లాలో డిప్లమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయనగరం జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాటరల్ ఎంట్రీ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్ టెక్నాలజీ రెండు మూడు సంవత్సరాల డిప్లమో కోర్సుల కొరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 1వ తేదీ లోపు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు అభ్యర్థులు www.iihtvgr.com వెబ్సైట్, 9399936872, 9866169908, 9010243054 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రాంగణ నియామకాల్లో డైట్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాలలో ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం విద్యార్థులు ఎస్4 ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ వారు నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో అద్భుత ప్రదర్శన కనబరిచి ప్లేస్‌మెంట్ సాధించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ శుక్రవారం మాట్లాడారు. కోర్ ఇంజనీరింగ్ అయిన సివిల్, ఎలక్ట్రికల్ విద్యార్థులకు ప్రత్యేకంగా ఆధునిక ప్రపంచంలో ఎక్కువ ప్రాముఖ్యత ఉన్న కోర్సులను క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్‌లో భాగంగా అందిస్తామని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో డైట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హేమంత్ కుమార్, డీన్ అకాడెమిక్స్ డాక్టర్ కె పార్వతి, డీన్ అడ్మినిస్ట్రేషన్ ఈశ్వరరావు, అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణనాగ్ పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడాకారులకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో శుక్రవారం క్రికెట్ క్రీడాకారులు గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలుని కలిసి క్రికెట్ క్రీడా అభివృద్ధికి సహకరించాలని కోరగా, స్పందించిన వారు తమ వంతు సహాయంగా క్రికెట్ కిట్లు కొనుగోలుకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు బొంది మహేష్, అర్జిల్లి బంగారు రాజు, మైలపల్లి పోలరాజు, తిత్తి పైడిరాజు, తిత్తి రాజు, చోడిపల్లి గంగరాజు, స్థానిక నాయకులు సూరాడ ముత్యాలరావు, అర్జిల్లి తాతారావు, సమ్మంగి సోమేశ్వరరావు, కణితి చినసోమేశ్వరరావు, సమ్మంగి అప్పలరాజు పాల్గొన్నారు.

అతుల్ కుమార్ అంజన్ మృతికి సంతాపం

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆలిండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అతుల్ కుమార్ అంజన్ మృతికి ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ శుక్రవారం ఒక్క ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలియజేశారు. తుది శ్వాస వరకు రైతు సమస్యలపై ఆయన పోరాటాలు చేశారని గుర్తు చేశారు. స్వామినాథన్ కమిటీ సభ్యులుగా, ఎంపీగా ఆయన పనిచేశారని తెలిపారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు.